

# నా కళ్ళతో నాన్న

– లిపి మల్లాది



ఆంధ్రుల ఆహ్లాద రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు ఇటీవల ఫేమిలీ ఆల్బమ్ పేరుతో సొంత అనుభవాలను రచనలో వ్రాశారు. వందల, వేల పాత్రలను సృష్టించిన మల్లాదిగారిని వాళ్ళ అమ్మాయి కళ్ళతో చూస్తే ఎలా ఉంటుంది? అందుకు సమాధానమే ఈ ధారావాహిక. మల్లాదిగారు, పద్మజగార్లకు ముగ్గురు సంతానం - కావ్య, ఊహ, లిపి. ముగ్గురూ అమెరికాలోనే ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్నారు. చిన్నమ్మాయి లిపి, వాళ్ళ నాన్నగారి గురించి వ్రాస్తున్న ఈ సంఘటనలు పాఠకులకు ఆసక్తికరంగా ఉంటాయని ఆశిస్తున్నాం.

*(గత సంచిక తరువాయి)*

**ఈ నెల** మా నాన్న పుట్టినరోజు అవ్వడం వల్ల ఈ కథాంశాన్ని నాతోపాటు మా బంధువులు కూడా రాసారు. వారిలో చాలామంది గురించి మీరు ఇదివరకటి ఎపిసోడ్స్‌లో చదివే ఉంటారు. సమయాన్ని కేటాయించి, పాత జ్ఞాపకాలను తవ్వి, ఈ శీర్షికకు సహాయపడిన వారందరికీ నా ధన్యవాదాలు. ఇది చదివి మా నాన్న ఆనందిస్తారని ఆశిస్తూ మొదలుపెడుతున్నాము.

మా నాన్న చిన్నప్పటి విషయాలు తెలుసుకోవడం నాకు చాలా ఇష్టం. "మా నాన్న చిన్నప్పుడు అల్లరి చేసేవాడా?", "మా నాన్న నువ్వూ ఎప్పుడైనా కొట్టుకున్నారా?" , "మా నాన్న స్కూల్లో ఎలా ఉండేవారు?" మొదలగు ప్రశ్నలు నేను మా బంధువులను కలిసిన ప్రతిసారీ అడిగేదాన్ని (ఎంత తెలుసుకున్నా ఆసక్తి తరగని బాల్యమది). నాకు నవ్వు తెప్పించిన, ఆశ్చర్యపరచిన, కావ్య ఊహకి కూడా తెలియని కొన్ని కథలు:

ఓసారి మా నాన్నగారి అక్క శ్యామల మా ఇంటికి వచ్చినప్పుడు ఆవిడ నాకు చెప్పిన కథ ఇది.

"చిన్నప్పుడు నాయనమ్మ మాకు రోజూ స్కూల్‌కి వెళ్ళడానికి బస్ టికెట్ కోసం ఓ అణా ఇచ్చేది. కానీ మాకు స్కూల్‌కి షార్ట్‌కట్ దారి తెలుసు. మేము ఆ దారిలో నడిచి వెళ్ళేవాళ్ళం కాబట్టి ఆ అణా బస్ టికెట్ ఖర్చయ్యేది కాదు. నేను, ప్రమీల, నిర్మల రిబ్బన్లు, గాజులు కొనేవాళ్ళం. మణి ఓసారి సినిమాకి వెళ్ళాడు. రాజ్యం, లీల మిఠాయి కొని తినేవాళ్ళు. మీ నాన్న మాత్రం ఆ అణాతో లైబ్రరీ నుండి పుస్తకాలు అద్దెకి తెచ్చుకుని చదివేవాడు. మీ నాన్నకి అప్పట్నించే పుస్తకాలపై ప్రేమ ఉండేది" ఫ్రెండ్స్‌తో ఆడుకోవడం కన్నా ముఖ్యమైన పనులు లేని నన్ను ఆ కథ ఎంతో కదిలించింది.

మా నాన్నకి మా పై ఎంత ప్రేమ ఉందనే విషయాన్ని తన అక్క నిర్మల నా చేతి రేఖలు చూస్తుండగా తెలుసుకున్నాను. (`ఈ రేఖ అర్థం మీ నాన్నకి నువ్వంటే ఇష్టం` లాంటి విషయం కాదు).

"ఒకసారి నాకు మీ నాన్న ఫోన్ చేసాడు. అప్పటికి నువ్వింకా పుట్టలేదు. కావ్య చిన్నపిల్ల. అప్పుడు నేను మీ ఇంటికి వచ్చాను. మీనాన్న కావ్య చేతిలో ఆయుషు రేఖని చూపించి "ఇది పూర్తిగా లేదు" అని చాలా బాధపడుతూ అన్నాడు. ఇప్పుడు నీకు వివరించినట్టే మీ నాన్నకి కూడా వివరించి ఆ రేఖ అర్థాన్ని చెప్పాను."

జాతకాలని నమ్మకపోయినా కావ్య చేతిలోని అరగీతను చూసి 'బహుశా నిజమేమో?' అనే సందేహంతో మా నాన్న ఎంత సతమతమై ఉంటే తన అక్కని సంప్రదించి ఉంటారో నేను ఊహించగలను.

నా చిన్నప్పుడు మా నాన్నగారి అన్నయ్య మణి నాకు చెప్పిన ఈ కథనే తన అక్క లీల ఓ సందర్భంలో నాకు చెప్పారు: "వాతావరణం చల్లగా బావున్నప్పుడు మేమంతా ఆరుబయట మంచాలు వేసుకుని పడుకునేవాళ్ళం. ఓ మధ్య రాత్రి వాన కురవడం మొదలైంది. మేమంతా లేచి లోపలికి పరిగెత్తాం కానీ మీ నాన్న మాతో లోపలికి రాలేదు. నాయనమ్మతోపాటు మేమూ బయటకి వెళ్ళి చూస్తే మీనాన్న అక్కడే పడుకుని ఉన్నాడు. లేపే ప్రయత్నం చేసినా లేవకపోవడంతో "వాడు లేచేట్టు లేడు. వాన ఎక్కువయ్యేలా ఉంది. లోపలికి పదండి" అని నాయనమ్మ అంది.

మర్నాడు ఉదయం మీ నాన్న లేచి "అదేంటి? నా రగ్గు తడిసిపోయిందే?" అని అడిగాడు.

"రాత్రి వాన పడింది" అని మేము చెప్పాము.

"మరి నన్ను లేపలేదేంటి?" అని అడిగాడు.

"నిన్ను ఎంత లేపినా లేవకపోయేసరికి అమ్మ వదిలేయమంది" అని మణి జవాబిచ్చాడు ఆ కథని నాకు చెప్పినప్పుడు వాళ్ళు ఎంత నవ్వారో, మాన్నని కొన్ని సంవత్సరాల క్రితం నేను అడిగినప్పుడు ఆయనా అంతే నవ్వారు.

మా నాన్నకి, తన పెద్దక్కకి మధ్య బాగా ఏజ్ గ్యాప్ ఉండడంతో ఆవిడ కొడుకు ప్రసాద్, మా నాన్న మంచి స్నేహితులయ్యారు. అలాగే ఆయన భార్య పద్మజ, మా అమ్మ పద్మజ, వారి పెద్ద కూతురు మానస, మా అక్క కావ్య కూడా మంచి స్నేహితులు. ప్రసాద్ అమెరికాకి వెళ్ళాక పద్మజ పార్లర్ నడుపుతున్నప్పుడు మా నాన్న అక్కడ కొన్ని నవలలు పెట్టడం ఆవిడకి ఆనందాన్ని కలిగించిందట. నాకు చిన్నప్పుడు ఆవిడ హెయిర్ కట్ చేస్తుండగా అస్తమానూ తల తిప్పినా, "కదలకు స్ట్రెయిట్‌గా చూడు లిప్పాయ్" అని ఎంతో సహనంగా పదినిమిషాల్లో అయ్యేపనికి అరగంట పట్టినా నవ్వుతూ కథలు చెప్పడం నాకు బాగా గుర్తు. ఆవిడ నాతో పంచుకున్న కొన్ని విషయాలివి: "మీ నాన్న నాతో, ప్రసాద్‌తో చాలా జోవియల్‌గా నవ్వుతూ నవ్విస్తూ ఉంటారు. నేను ఫోన్ చేసినప్పుడు కాల్ రిసీవ్ చేసుకున్నాక "ఏమీ లేదండి మరి" అని మాట్లాడ్డం అలవాటు. మీనాన్న "ఏమీ లేదా? అయితే ఫోన్ పెట్టేయాలా?" అని జోక్‌గా అనేవారు. "నో.నో.ఉంది" అని వెంటనే అనేదాన్ని.

"నాన్న ఎక్కువగా మాట్లాడేవారు కాదు. మా బ్రదర్ కూడా చాలా తక్కువ మాట్లాడేవారు. ఒకసారి మీ ఇంటికి వచ్చాడు. ఇద్దరూ ఎక్కువ మాట్లాడని వాళ్ళని ఎదురూ బదురు కూర్చోపెడితే ఎంత ఫన్నీగా ఉంటుందో. ఇద్దరూ నవ్వుతున్నారు కానీ మాట్లాడ్డంలేదు. అలా నాకు తెలిసి గంటపైనే గడిచింది. అప్పుడు సిట్యుయేషన్ చూసి చాలా నవ్వుకున్నాం. నీ చిన్నప్పుడు మేము మీ ఇంటికి బాగా వచ్చేవాళ్ళం. నాన్న చాలా స్పాంటేనియస్‌గా జోక్స్ వేస్తారు. ఆయన మాకు గాడ్ ఫాదర్‌తో సమానం. చాలా కైండ్ హార్టెడ్ కానీ అలా కనబడనివ్వరు. నాన్న ఎప్పుడూ విషయాన్ని చాలా ఫన్నీవేలో ప్రెజెంట్ చేసేవారు. సీరియస్ సిట్యుయేషన్స్‌ని కూడా చాలా జోక్‌గా చెప్పేవారు. దాంతో మైండ్ ఈజీగా లైట్ అయ్యేది. ప్రసాద్‌ని కొన్నిసార్లు టీజ్ చేసేవారు. నేను తప్పు చేసినా ఆయన ఎప్పుడూ తిట్టకుండా నవ్విస్తూ సరిచేసేవారు. అలా నవ్వుతూ తప్పు తెలుసుకునేదాన్ని. జీవితంలో ఏది ఎదురైనా ముందుకి కొనసాగాలి అనేది మీ అమ్మనుండి నేర్చుకున్నాను." ఈ సంభాషణ పూర్తయ్యే సమయానికి మేమిద్దరం బాగా ఎమోషనల్ అయ్యాము. (చదివాక మా నాన్నకూడా అవుతారని నాకు తెలుసు) పెళ్ళి విషయంలో కచ్చా పక్కాగా ఉన్న నాకు ఆవిడ ప్రోస్ ఎండ్ కాన్స్‌ని వివరించి వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా ఎలా ఉండాలో క్లుప్తంగా

"ఔను కదా" అనిపించేలా వివరించారు. నా జీవితంలో ఆవిడంత స్ట్రాంగ్ ఎండ్ ఇండిపెండెంట్ వ్యక్తి మరొకరిని చూసి ఎరగను. ఓ విధంగా ఆవిడ నాకు ఇన్స్‌ఫిరేషన్ అనచ్చు. మా నాన్నగారి పెద్దక్క మనవడు చేతన్, నేను ఒకే వయసవ్వడంతో మేము మంచి స్నేహితులమయ్యాము. ఎన్నో టాలెంట్స్ ఉన్న అతను మా నాన్నకి నచ్చిన ఆర్టిస్ట్ ఎందుకంటే తను గీసిన కళ్ళని మా నాన్న 'సావిరహే' నవల రీ ప్రింట్‌కి కవర్ ఫోటోగా వాడారు. ఓ రోజు చేతన్ నవ్వుతూ నాకు చెప్పిన ఓ సంఘటన:

"ఒకసారి నేను, మానసక్క, స్వప్నక్క అందరం పైన మా ఇంట్లో ఉన్నాం. అప్పుడు కింద ఎవరో బెల్ కొడితే మేము చెరితని పంపించాము ఎవరో చూడమని. అప్పుడు చెరిత సిక్స్‌త్ క్లాస్ అనుకుంటా. మా నాయనమ్మ 'ఎవరొచ్చారు' అని అడిగితే "క్రిష్టఫర్ తాత" అని చెప్పింది. మా ఎవరికీ అర్థంకాలా క్రిష్టఫర్ తాత ఎవరని. అప్పుడు జమునత్త వెళ్ళి చూస్తే అది మీ నాన్న. అందరూ 'కిష్టప్ప తాత' అని పిలవడం విని మీ నాన్నని 'క్రిష్టఫర్‌తాత' అనుకుంది పాపం. "ఈ రోజుకీ అది గుర్తొచ్చినప్పుడల్లా నేను చాలా నవ్వుకుంటాను. మా పెద్దనాన్న పిల్లలు రవి, శశి నేను రాఖీ కట్టిన ఏకైక అన్నయ్యలు. నేను మొదటిసారి పూల్ ఆడింది, కావ్య మొదటిసారి స్విమ్మింగ్‌కి వెళ్ళింది శశితోనే. చిన్నప్పుడు ఒకరోజు మా పెద్దమ్మ దగ్గరకి వెళ్ళి "శశన్నాయ్ నన్ను కుంకుమయ్యా అన్నాడు" అని కోపంగా చెప్పానట. కుంకమయ్యా ఏంటా అని శశిని అడిగినప్పుడు నవ్వుతూ "కుంకాయమ్మ అన్నానమ్మా" అని చెప్పాడట. అప్పటినుండి నాపేరు 'కుంకమయ్యా' అయ్యింది. పెద్దబ్బాయి రవి మా నాన్న గురించి రాసిన కొన్ని వాక్యాలు: "మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు నాకు బాబాయ్ అవుతారు. నా చిన్నప్పటి నుండి ఆయన సీరియస్, స్ట్రాంగ్ పర్సనాలిటీగా నాకు తెలిసినా చాలా సెన్స్‌ఆఫ్ హ్యూమర్ గల వ్యక్తి. ఆయన రాసిన ఎన్నో నవలల్లో కొన్నిటిని సినిమాలుగా తీసారు. ఆయనకి తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీలో ఉన్న స్నేహితుల్లో కొంతమంది వారింటికి రావడం నేను కొన్నిసార్లు చూసాను. చాలా హార్డ్ వర్కింగ్ అండ్ ఇంటెలిజంట్ వ్యక్తి. దూరదృష్టి కలిగి ఎప్పుడూ ప్రాక్టికల్‌గా ఉంటారు. నేను కొన్ని విషయాల్లో ఆయన ఎడ్వైస్‌ని తీసుకుంటాను. నేను ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఆయన నాకు అందించిన సహకారం వల్ల నేను సక్సెస్‌ఫుల్ అయ్యాను. ఆయన ప్రోత్సాహాన్ని ఎప్పటికీ మరవలేను."

నా చిన్నప్పుడు నేను, నా ఫ్రెండ్ సమ్మి గోడలు దూకి ఆడుకునేవాళ్ళం. అప్పుడు నాకు దూకడం వచ్చుకానీ తిరిగి ఎక్కడం రాదు. (మా అమ్మ ఎన్నిసార్లు వద్దన్నా చేసిన పనుల్లో అది ఒకటి) వెంటిలేటర్‌లోంచి సహాయానికి పిలిచిన ప్రతీసారీ కోప్పడకుండా ఎక్సామ్స్‌కి ప్రిపేర్ అవుతున్న రవి పుస్తకాలు పక్కన పెట్టి నన్ను ఎత్తుకుని దింపేవాడు. (కొన్నిసార్లు గంటలో ఎనిమిదిసార్లు సహాయం కోరిన సంఘటనలు కూడా ఉన్నాయి.)

వేసవి సెలవల్లో పిల్లలంతా మా అమ్మమ్మగారి పల్లెటూరులో చేరేవాళ్ళం. పగలు, రాత్రే కాక మధ్యాహ్నం ఎండకూడా మా ఆటలకి అడ్డువచ్చేది కాదు. ఓరోజు మా అమ్మ వాళ్ళ తమ్ముడు, చక్రి మమ్మల్ని పిలిచి ఇంటి వెనక తోటని శుభ్రం చెయ్యమని చెప్పారు. "డర్టీగా ఉంది", "నువ్వు అటు క్లీన్ చెయ్యి, నేను ఇటు క్లీన్ చేస్తా", " నా బదులు కూడా నువ్వే చేస్తావా ప్లీజ్?" అనుకుంటూ దాదాపు పదిమంది పిల్లలం కలిసి అంతా శుభ్రం చేసాము. అది చూసి మెచ్చుకుంటాడని ఎదురు చూసిన మా కళ్ళకి కనబడిని సిగరెట్ పీకలు చక్రికి కనబడ్డాయి. "ఛీ. యాక్. నేను టచ్ చెయ్యను", "అంతా క్లీన్ చేసాం కదా బాబాయ్, అవొక్కటి వదిలేస్తే ఏమైంది?", "అలసిపోయాం పెదనాన్నా" అని మేమంతా అన్నాం. దానికి ఆయన "మల్లాదిగారు గొప్ప రచయిత. వాళ్ళింట్లో పై భాగాన్ని కడుతున్నప్పుడు ఓ రోజు పొద్దున ఎవరూ పని చెయ్యట్లేదు. 'ఏమైంది' అని ఆయన అడిగినప్పుడు 'మట్టి అక్కడ ఉంది. అది తెచ్చిపోయడానికి తట్ట కోసం చూస్తున్నాం' అని ఓ పనివాడు చెప్పాడు. 'దాని కోసం పని ఆపడం దేనికి?' అని ఆయన చేత్తో మట్టిని పోసారు. 'మనింట్లో పని మనం చేసుకోవడంలో తప్పేంటి?' అన్నారాయన. పెన్ను పట్టుకున్న చేత్తో మట్టి ముట్టుకున్నారు" అని ఆయన చెప్పాక పిల్లలంతా నిశ్శబ్దంగా బయటికి వెళ్ళాము.

మా అమ్మ వాళ్ళ అక్క లక్ష్మి "బికాం హై సెకండ్ క్లాస్‌లో పాస్ అయ్యాను" అని చెప్పినప్పుడు మా నాన్న "ఫస్ట్‌క్లాస్‌లో పాసయినవాళ్ళు చాలా కష్టపడి చదివినవాళ్ళు, థర్డ్ క్లాస్‌లో పాసైనవాళ్ళు అస్సలు కష్టపడి చదవనివాళ్ళు, హై సెకండ్ క్లాసులో పాసైనవాళ్ళు కాపీ కొట్టి పాసైనవాళ్ళు' అని అనేవారట.

లక్ష్మి వాళ్ళ అమ్మాయి శ్రావ్య, నేను ఇప్పటికీ నవ్వుకునే విషయం ఓసారి ఊహ పుట్టినరోజున జరిగింది. మేలో ఊహ పుట్టినరోజుకి అందరం బయట భోంచేసి ఇంటికి వచ్చాక ఓ ప్రొడ్యూసర్ మా నాన్నకి ఫోన్ చేసి ఓ సినిమా ప్రివ్యూకి రమ్మని ఆహ్వానించారు. 'ఏం సినిమా?' అని మా అమ్మ అడిగినప్పుడు ఆయన చాలా ఇబ్బంది పడుతూ 'నువ్వే నా కావలి' అని చెప్పారు సెలవులకి వచ్చిన బంధువులతో పాటు శ్రీనగర్ కాలనీలో ఉన్న చుట్టాలకి ఫోన్ చేసి మరీ "లచ్చీ, నువ్వేకావాలి సినిమా ప్రివ్యూకి వస్తావా?" అని అడిగాము. ఇంతకీ మేము వెళ్ళింది తరుణ్ నటించిన, మేం అనుకున్న "నువ్వేకావాలి"కి కాదు. 'నువ్వే నాకావలి' అనే ఫెమినిస్ట్ సినిమాకి. సినిమా పూర్తయి బయటికొస్తుండగా జీవకళ పోయి జాంబీల్లా నడుస్తున్న పిల్లలవంక ఆ ప్రొడ్యూసర్ జాలిగా చూడ్డం నాకు ఇంకా గుర్తుంది.

శ్రావ్యకి గుర్తున్న మరో సందర్భం మేమందరం కలిసి తిరుపతి కొండని కాలినడకన ఎక్కినప్పుడు జరిగింది. అంత ఎత్తు ఎక్కడానికి ఆయాసపడుతూ నీరసంగా ఉన్న ఊహ నడవడానికి ఇష్టపడనప్పుడల్లా మా నాన్న 'పేచీ పెట్టకు ఊహా నీకో ఫ్రూటీ కొనిస్తాను" అని ప్రతీచోట ఊహకి ఫ్రూటీలు కొనిచ్చారు. ఆయన సహనం, ఊహ పట్ల ప్రేమ, చిరాకుపడకుండా నవ్వుతూ నవ్వించడం శ్రావ్య ఆ రోజు కనిపెట్టింది.

**మా నాన్న అక్క నిర్మల కూతురు శాంతి మాటల్లో: "ఊహ తెలిసాక అమ్మ తరఫు కుటుంబం చాలా పెద్దది అని, నాన్న వైపులా ఒక మేనత్త మాత్రమే ఉండరు అని అర్థమైంది. ఇద్దరు పెద్దమ్మలు, ఇద్దరు మావయ్యలు, నలుగురు పిన్నులు - మల్లాది వారిది చాలా పెద్ద ఫ్యామిలో పండగలకు, పబ్బాలకు, పెళ్ళిళ్ళకు కలిసామంటే సందడే సందడి. మావయ్యల గురించి ఇక్కడ ప్రత్యేకంగా చెప్పాలి. ఎందుకంటే ఇద్దరికీ స్వభావంలో చాలా వ్యత్యాసం ఉంటుంది. పెద్ద మావయ్య మల్లాది సుబ్రమణ్యం (మేము మణి మామ అని పిలుస్తామనుకోండి) చాలా సరదాగా, పిల్లలని అందరినీ దగ్గర కూర్చోపెట్టుకుని కబుర్లు, కథలు - ముఖ్యంగా పాతాళభైరవి, మాయాబజార్‌లాంటి సినిమా కథలు రసవత్తరంగా, కళ్ళకు కట్టేటట్టుగా చెప్పేవారు. అందుకే ఆయనంటే అందరూ కూడా భయంలేకుండా దగ్గరికి వెళ్ళేవాళ్ళం. మావయ్య ఈ రోజు ఏం కథ చెపుతారా అని ఆతృతగా ఎదురుచూసేవాళ్ళం.**

**కానీ, మా చిన్నమావయ్య స్వభావం ఇందుకు పూర్తిగా భిన్నం. అప్పట్లో మల్లాది వెంకటకృష్ణమూర్తిగారు అంటే ఎవరో అని తెలియని వయసు. ఆయన ఒక పెద్ద రచయిత, ఆయనకి గల విపరీతమైన వీరాభిమానులు వందల కొద్దీ వచ్చే ఉత్తరాల గురించి తెలియని టైమ్. ఆ మాటకొస్తే ఆయన పూర్తిపేరు కూడా తెలియదు మాకు - మా కజిన్స్ అందరికీ ఆయన కిష్టప్ప మావయ్యగానే తెలుసు. అమ్మమ్మ కూడా మావయ్యని కిష్టప్ప అని పిలవడం ఒక కారణం కావచ్చు. కిష్టప్ప మామ మొదటి నుండీ చాలా సైలెంట్‌గా ఉండేవారు. అమమ్మ ఇంట్లో అందరం కలిసినప్పుడు కూడా మావయ్య ఎప్పుడూ బిజీగా ఒక రూములో కూర్చుని పొడవాటి పేపర్ల మీద పరపరా ఏదో ఒకటి రాసుకుంటూ ఉండటమే గుర్తు.**

**మావయ్య మొదట ఉద్యోగరీత్యా ఆ తర్వాత పెద్ద రైటర్ అయ్యాక కన్వీనియన్స్ దృష్ట్యా హైదరాబాదులోనే ఉండేవారు. పెళ్ళికి ముందు ఒక్కరే ఉండేవారు కనుక అక్కచెల్లెళ్ళ దగ్గరికి ఎప్పుడైనా వస్తూ ఉండేవారు. మా అమ్మతో ఆయనకి అనుబంధం కొద్దిగా ఎక్కువ కావటం వలన మా ఇంటికి వచ్చేవారు తరచుగా. కొన్ని రకాల వంటకాలు, ఆయనకి ఇష్టమైనవి, అమ్మ బాగా చేస్తుంది అనిపించేవి ఒకోసారి అడిగి చేయించుకునేవారు. "నిర్మలా, ఈరోజు నీ చేతి వంకాయ ఉల్లిమసాలా కూర తినాలని వచ్చానే," అని అడగటం నాకు ఇంకా గుర్తు. నేను నా తమ్ముడిని 'తమ్ముడూ' అని తప్ప పేరుతో పిలవడం అలవాటు లేకనేమో కిష్టప్ప మామ మా అమ్మని 'అక్కా'**

అని, అమ్మ ఆయనని 'తమ్ముడు' అని పిలవకుండా పేర్లతో పిలుచుకోవడం నాకు వింతగా అనిపించేది - మావయ్యని అక్కచెల్లెళ్ళు అందరూ 'కృష్ణా' అనే పిలిచేవారు.

ఒకసారి మావయ్య విపరీతమైన జ్వరంతో మా ఇంటికి వచ్చారు. జ్వరం తగ్గి కొద్దిగా కోలుకునే వరకూ, ఇంచుమించు ఐదారురోజులు మా ఇంట్లోనే ఉన్నారు. నేను, తమ్ముడు చాలా చిన్నపిల్లలం కావటంతో అంత జ్వరంలో కూడా మావయ్య "నాకు మందులు వద్దు నేను కూడా శాంతి, రత్నాకర్‌లలాగా ఏడుస్తాను మందులు వేస్తే" అని మారాం చేయటం మాకు సరదాగా అనిపించేది. ఆయన మమ్మల్ని ఏడిపించటానికి అలా అంటున్నారు అని కూడా తెలియని వయసు. నేను, తమ్ముడు హీరోలలాగా ఆయన చేతులు గట్టిగా పట్టుకుని "అమ్మా కిష్టప్ప మామని కదలకుండా పట్టుకున్నాం మందు వేసేయి" అని తొందరపెట్టేవాళ్ళం. మా తమ్ముడు సెకెండ్ క్లాస్‌లో ఉన్నప్పుడు వాడికి చాలా పెద్ద ఆపరేషన్ జరిగి దాదాపు రెండు నెలలు హైదరాబాద్ నర్సింగ్ హోమ్‌లో ఉండాల్సి వచ్చింది. మావయ్య ఆ టైమ్‌లో ప్రతి రెండు రోజులకు వచ్చి చాలాసేపు కూర్చుని వెళ్ళేవారు. అమ్మకి మనోధైర్యం అందించటంతో పాటు మావయ్యకి తమ్ముడి ఆపరేషన్ థీమ్‌తో ఒక నవల రాయాలనే ఐడియా కూడా అప్పుడే తట్టడం కూడా ఆయన ఎక్కువ టైమ్ హాస్పిటల్‌లో గడపటం జరిగింది.

అదే సంవత్సరం 'లిటిల్ రాస్కెల్' నవల సీరియల్‌గా పబ్లిష్ అవడం అందులో తన డైలాగులు అన్నీ కిష్టప్ప మామ ఆ నవలలోని ఏడేళ్ళ హీరోకి వాడటం మా తమ్ముడు తనే హీరోలా ఫీల్ అయ్యి అడిగినవారికి, అడగని వారికి కూడా చెప్పడం చాలా గుర్తుండి పోయిన జ్ఞాపకాల్లో ఒకటి. చిన్నపిల్లల మనస్తత్వాన్ని, చిలిపి చేష్టలను, అల్లరిని, అలకలను, అన్నిటినీ కళ్ళకు కట్టినట్టు చూపించిన 'లిటిల్ రాస్కెల్' నవల అంటే నాకు ఇప్పటికీ చాలా ఇష్టం - ముఖ్యంగా ఆ నవలలో నా తమ్ముడిని చూస్కోవడం బాగా అలవాటు అయిపోయింది. ఆ నవల ద్వారా మా రత్నాకర్ తెలుగు పుస్తకాభిమానుల మనస్సుల్లో ఎప్పటికీ నిలిచిపోయేలా చేసిన మా కిష్టప్ప మామకి కృతజ్ఞతలు.

సాధారణంగా ఎవరికైనా ప్రేమించే తల్లిదండ్రులుంటారు. కానీ అదృష్టవశాత్తు నాకు అలాంటి ఇద్దరు తల్లిదండ్రులున్నారు. పెంచి, పెద్దచేసి, తీర్చిదిద్ది, నా కోపానికి బలై, నేను చేసే తప్పులని క్షమిస్తూ, సరిచేస్తూ వచ్చిన తల్లిదండ్రులతోపాటు వారు హైదరాబాదులో లేని సమయంలో నా మంచి చెడ్డలు చూసి, నా సౌకర్యాలు, ఆరోగ్య వ్యవహారాలు తల్లిదండ్రుల్లా చూసింది మా అమ్మ వాళ్ళ అక్క ఛాయ, తన భర్త మూర్తి. పదహారేళ్ళనుండే ఒక్కదాన్ని ఇంట్లో వంటరిగా ఉండి హోంసిక్ అవ్వకపోవడానికి వారే కారణం. మా నాన్న గురించి ఆయనకి తెలిసిన ఓ విషయం మానాన్నకి కార్ డ్రైవింగ్ కన్నా మోటర్ సైకిల్ నడపడమే ఇష్టం.

ఛాయ నార్త్ ఇండియన్ డిషెస్‌లో రాజ్మా చాలా బాగా చేస్తారు. వండిన ప్రతిసారీ మా ఇంటికి పంపేవారు. "మీ ఛాయ రాజ్మా స్పెషలిస్ట్. చాలా బాగా చేసింది కదూ" అనేవారు మా నాన్న. మ ఇంట్లో లంచ్ టైం వాళ్ళ ఇంట్లో బ్రేక్‌ఫాస్ట్ టైం. పండగలకి పిండివంటలు చేసి పంపేసరికి మా భోజనం పూర్తయ్యేది. కానీ ఆ వంటకాలు బ్రహ్మాండంగా ఉండేవి. "ఛాయక్కయ్య వంటలు పిక్చర్ పోస్ట్‌కార్డ్‌లా ఉంటాయి" అని కావ్య అనేది.

రోజూ పొద్దున వాకింగ్ పూర్తయ్యాక పెదనాన్న మా ఇంటికి వచ్చి మా అమ్మతో కాఫీ తాగుతూ కబుర్లు చెప్పేవారు. నాన్న నిద్రలేచి వచ్చి వారిని జాయిన్ అయ్యేవారు. కానీ కాఫీ తాగేవారు కాదు. ఎప్పుడైనా ఉదయం రాలేకపోతే సాయంత్రాలు వచ్చేవారు. అప్పుడు మా నాన్న "ఇదిగో పద్మా, మీ బావ వచ్చారు. కాఫీ ఇవ్వు" అనేవారు. తను వద్దంటే మా నాన్నే ఇద్దరికీ గ్రీన్ టీ చేసి తెచ్చేవారు. ఎంత రాసుకుంటూ బిజీగా ఉన్నా పెద్దనాన్న ఇంటికొచ్చినప్పుడు మా అమ్మా, నాన్న ఇద్దరూ ప్రేమగా మాట్లాడతారు. నేనే కాకుండా కావ్య, ఊహతో కూడా చాలా ప్రేమగా ఉంటారు. ఊహకి ఇష్టమని సమ్మర్‌లో రోజూ తాటి ముంజులు తీసుకురావడం, కావ్యకి ఇష్టమని

కుదిరినప్పుడల్లా దాదూస్‌లో పానీపూరీ తినిపించడం మొదలుగున్నవి చేసేవారు. మా ముగ్గురిలో ఇండియాకి ఎవరు వెళ్ళినా ఆయన తప్పకుండా ఎయిర్ పోర్ట్‌కి వస్తుంటారు.

కావ్య గ్రాడ్యుయేషన్‌కి ఛాయ ఫ్లోరిడా వచ్చినప్పుడు పై అంతస్థులో ఉండేవారు. ఓ రోజు కావ్య "ఛాయక్కా మెల్లిగా నడువు. కింద ఇంట్లో వాళ్ళు కంప్లైన్ చేస్తారు" అందట. "నేనెక్కడమ్మా పిల్లిలా నడుస్తుంటేను" అని ఛాయ బదులిచ్చిందట.

"నువ్వు పిల్లిలా కాదు ఛాయక్క, గండుపిల్లిలా నడుస్తున్నావ్" అని కావ్య అందట. అది జరిగిన కొన్ని సంవత్సరాలకి కూడా ఆ సంఘటన వివరించి తను దాదాపు పదినిమిషాలు నవ్వింది. "కావ్యకి అంత తెలుగొచ్చని నేను అనుకోలేదు" అని నాన్న చాలాసేపు నవ్వారు.

మనం ఎవరినైనా కలిసినప్పుడు వారిపై కొన్ని అభిప్రాయాలు ఏర్పడతాయి. వారిని తలచుకున్నప్పుడు ముందుగా అవే గుర్తొస్తాయి. అలా మా నాన్నగారి చెల్లెలు ఉష కూతురు ఇందిరకి మా నాన్న విషయంలో గుర్తున్నవి - ఒకటి మా ఇల్లు, రెండు తక్కువగా మాట్లాడే స్వభావం. తన చిన్నప్పుడు మా నాన్నతో పట్టుమని పదినిమిషాల సంభాషణలు కూడా తక్కువే అట. ఎంత చిన్నవయసైనా మా నాన్న అందరిలా కాని వ్యక్తి అని పసిగట్టింది. మా నాన్న మనస్తత్వాన్ని తను అర్థం చేసుకుంది. తన పెళ్ళై డాలస్‌లో ఉండగా ఆయన కావ్య, మా అమ్మతో కలిసి వారింటికి వెళ్ళినప్పుడు చిన్నప్పటినుండి తెలిసినా అప్పుడే ఇందిర మా నాన్నతో కూర్చుని మొదటిసారి మాట్లాడింది. జనరల్ విషయాలతోపాటు ఆధ్యాత్మిక విషయాలు కూడా చర్చించారట. మాటల్లో మా నాన్న ఇందిరని కొన్ని ప్రశ్నలడిగారట - పరాయిదేశంలో ఇబ్బందులు, కొత్త కల్చర్‌కి అడ్జస్ట్ అవ్వడం, ఇండియాకి అమెరికాకి ఉన్న తేడాలు, ఇద్దరు చిన్నపిల్లలను పెంచడం, మొదలుగునవి. ఆ సంభాషణలో ఇందిర మాట్లాడినప్పుడు మా నాన్న ధ్యాసతో విన్నారట. మా నాన్న నాలెడ్జ్‌కి తను ఆశ్చర్యపడి మొదటిసారిగా మా నాన్న బంధువు అయినందుకు గర్వపడిందట.

మర్నాడు ఇందిర, తన భర్త శ్రీకర్ అక్కడి ప్రదేశాలను చూపించడానికి మా నాన్నతో బయటికి వెళ్ళినప్పుడు మా నాన్న అన్నీ అటెంటివ్‌గా విని, నోట్స్ రాసుకుంటూ ఉండడం గమనించిందంట. షర్లాక్ హోమ్స్ బ్రైన్ సాధారణ మనుషులకన్నా సూక్ష్మంగా ఎలా పనిచేస్తుందో మా నాన్న బ్రైన్ కూడా ఎప్పుడూ రైటర్ మోడ్‌లో ఉండి పని చేస్తుందన్న విషయాన్ని రెండు మూడు నెలల తర్వా మా నాన్న పంపిన ట్రావెలాగ్ పుస్తకాన్ని చదివి అర్థం చేసుకుందట. ఆ పుస్తకంలో అక్కడ తిరిగిన ప్రదేశాలు, ఇందిరతో జరిగిన సంభాషలతోపాటు అక్కడ వెళ్ళిన స్ట్రీట్ నేమ్స్, వగైరా డీటెయిల్స్ అన్నీ చదివాక మా నాన్న తన చుట్టుపక్కల విషయాలన్నీ అబ్సార్బ్ చేసుకుని ఎప్పుడూ రైటర్‌లా ఉంటారని తెలుసుకుందట. అలాగే ఆయన తక్కువ మాట్లాడ్డానికి రీజన్ ఆయన హై ప్రాసెసింగ్ బ్రైన్‌వల్ల అని ఎన్నో ఏళ్ళుగా ఎంతోమందికి అంతుచిక్కని విషయాన్ని ఇట్టే పసిగట్టింది. ఆయన రాసిన రచనలు ఎన్నో చదివి తన శైలిని మెచ్చి, ఇంకా ఎన్నో నవలలతోపాటు తనతో కాన్వర్సేషన్స్ కూడా ఉండాలని ఆశిస్తూ హ్యాపి బర్తడే చెప్పింది. నిజానికి మా నాన్నతో గడిపిన తక్కువ సమయంలో ఆయన్ని అంతలా అర్థం చేసుకుంది ఇందిరే. మా నాన్న కలినప్పుడు వాళ్ళ రెండో అమ్మాయి మనస్విని చాలా చిన్నపిల్ల. పెద్దమ్మాయి కైవల్య చాలా బుద్ధిమంతురాలని ఈ రోజుకీ మెచ్చుకుంటుంటారు. ఇందిర తమ్ముడు సుధీర్ కలిసేటప్పటికే మా నాన్న పెద్ద రచయిత అవ్వడంతో తనకి మా నాన్న ఔట్ లయ్యర్‌గా అనిపించేవారట. ఎందుకంటే మా కుటుంబంలో దాదాపు అందరూ ఉద్యోగాలు చేసి కుటుంబాన్ని పోషించి రిటైర్ అయ్యేవారు. మా నాన్నకూడా అలాగే మొదలు పెట్టి గవర్నమెంట్ జాబ్ చేసినా తన హాబీయే తన ప్రొఫెషన్‌గా మారింది. అలా పేషన్‌ని ప్రొఫెషన్‌గా మార్చాలని ఎంతోమంది ప్రయత్నిస్తే కొంతమంది మాత్రమే వెలుగులోకి వస్తారని నాకు సుధీర్ చెప్పాడు.

ప్రముఖ రచయిత మల్లాది బంధువులమని స్నేహితులతో, తెలిసినవారితో పంచుకోవడం చాలా గర్వకారణంగా ఉండేదట. ఓసారి వాళ్ళు హనుమకొండలో ఉన్నప్పుడు ఇంటి ఓనర్లు మా నాన్న వస్తున్నారనే విషయాన్ని తెలుసుకుని ఎక్సైట్ అయ్యారట. వాళ్ళు మా

నాన్నతో మాట్లాడాలనుకుంటున్నారని తెలిపారట. మా నాన్న వారి ప్రశ్నలకు తన రీతిలో సమాధానాలను చెప్పడం సుధీర్‌కి ఇంకా గుర్తుంది.

మా నాన్న రచనల్లో తన శ్రమని ధారపోసి మంచి స్థాయికి వచ్చినట్టే సుధీర్ చదువులో శ్రమించి బెస్ట్ యూనివర్సిటీస్‌లో చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడ్డాడు. అమెరికాలో ఎన్నేళ్ళున్నా మన సంప్రదాయాన్ని, కట్టుబాటుల్నీ మర్చిపోని కొంతమందిలో సుధీర్ ఒక్కడు. (తన మేధస్సు తనతో చెస్ ఆడితే ఇట్టే తెలుస్తుంది.)

మా నాన్నగారి అక్క ప్రమీల కూతురు వాణి వల్ల నేను మొదటిసారి పీటల మీద కూర్చున్నాను. తన పెళ్ళిలో నేనే తోడు పెళ్ళికూతుర్ని. అంత ఏజ్ గ్యాప్ ఉన్న నేను ఇబ్బంది పడకుండా సులభంగా మాట్లాడగలిగేట్టు కలుపుకోగలడం తన ప్రత్యేకత. నేను ఆఖరిసారి తోడు పెళ్ళి కూతురయ్యింది ఊహ పెళ్ళికి. అంకురార్పణ రోజు పూజ పూర్తయ్యాక పంతులుగారు "తోడు పెళ్ళి కూతురు కాళ్ళు చూపండమ్మా పసుపు రాయడానికి" అన్నారు. పసి పాదాలకై ఎదురు చూసిన ఆయన ఘటోత్కచుడు లాంటి నా పాదాలను చూసి బెదిరినప్పుడు నేను నవ్వు ఆపుకోలేకపోయాను. వాణికి మా నాన్నతో ఉన్న మొదటి జ్ఞాపకాల్లో ఒకటి అక్టోబర్ 1987లో విజయవాడలో మా తాతయ్య అంత్యక్రియలకి అంతా హాజరయినప్పుడు అందరూ బాధపడుతుండగా మా నాన్న, దాదాపు ఐదు నెలల వయసులో బొద్దుగా ఉన్న ఊహని ఆడిస్తున్నారట. ఆ తరువాత మా నాన్న యూరోప్ ట్రిప్ ముగించుకుని బొంబేలో వారింటికి వెళ్ళారు. యూరప్ కబుర్లు మా నాన్న చెప్తుండగా వాణి ఆశ్చర్యపడుతూ వినిందట. ఆంస్టర్ డాం లేదా బ్రసుల్స్‌లో 'ఇండియన్ టానిక్' అని రాసున్న ట్రాష్‌కేన్ ఫోటోని మా నాన్న చూపగా 'ఇండియన్స్ అంత చులకనా?' అని అందరూ కోపానికి గురయ్యారట.

మరోసారి, యూరోప్ నుండి తిరిగి వచ్చాక అందరూ కలిసి ఆ రోజు బయట డిన్నర్ చేసి వచ్చారు. మర్నాడు మా నాన్న తన అక్కని కిచెన్‌లోకి తీసుకువెళ్ళి ఫ్రిడ్జ్ పక్కన ఉన్న 'ఫేక్ పూప్' చూపించారట. బెదిరిపోయిన ఆవిడ షాక్ అయ్యారట. నెమ్మదిగా పిల్లలను పిలిచి అడిగారట. ఎవరికీ దాని కారణం తెలీకపోవడంతో ఆవిడ భర్తని కూడా అడిగారట. ఏం చెయ్యాలో తోచని సమయంలో మా నాన్న ఓ బ్రౌన్ బాగ్‌లో ప్లాస్టిక్ 'ఫేక్ పూప్' చూపారట. తన అక్క తెల్లబోయి, చూడ్డాన్ని తిరస్కరించినప్పుడు అందరూ చాలా నవ్వారట. ఆ ప్రాక్టికల్ జోక్‌కి బలైన మొదటి వ్యక్తి ఆవిడ. ఆఖరి వ్యక్తి నేను. నా చిన్నప్పుడు ఎన్నోసార్లు డైనింగ్ టేబుల్ మీదో, నడుస్తుండగా నేలమీద మా నాన్న పెట్టిన ఆ వస్తువుని చూసిన ప్రతీసారీ నేను నిజమే అనుకునేదాన్ని.

తెలిసీ తెలియక నేను ఏదైనా తప్పుగా రాసుంటే మన్నిస్తారని భావిస్తున్నాను. పాఠకులకి కన్ఫ్యూజన్ ఉండకూడదని పేర్లకి వరసలు కలపలేదు. ఏదైనా బాధాకరంగా లేదా నొప్పించేలా ఉంటే క్షమించండి.

*(నాన్నకబుర్లు మరిన్ని వచ్చేనెలలో)*

Click here to share your comments on this story